ప్రజాశక్తి
గురువారం 31 అక్టోబర్ 2024
5
కర్నూలు

వ్యాపారుల సిండికేట్ అరికట్టాలి

- ఉల్లి రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యాపారస్తుల సిండికేట్ అరికట్టాలని, మార్కెట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య సర్కిల్‌లో ఉల్లి రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఉల్లి రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని, జాయింట్ కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. గిట్టుబాటు ధర ఇచ్చేవరకు పోరాడుతామని పెద్ద ఎత్తున రైతులు నినదించారు. వార్త మెయిన్‌లో

పేలుతున్న ధరలు

• 25 శాతం పెరిగిన టపాసుల ధరలు

• కొనుగోలుకు సామాన్యుల అనాసక్తి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టపాసుల ధరలు మండుతున్నాయి. గతేడాది కంటే 25 శాతం వరకు ధరలు పెరగడంతో టపాసులను కొనేందుకు సామాన్యులు ఆసక్తి చూపడం లేదు. ధరల పెరుగుదలతో వ్యాపారాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపారస్తులు అంటున్నారు..

దీపావళి అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది కాకపూల వెలుగులు, టపాసుల ఢాం..ఢాం శబ్దాలు. చాలా మంది అవి లేకుండా దీపావళి పండుగ జరుగదు. దీపావళికి కొనుగోలు చేసే టపాసుల ధరలు ఈ ఏడాది మండుతున్నాయి. గతేడాది కంటే 20 నుంచి 25 శాతం వరకూ ధరలు పెరగడంతో సామాన్యులు టపాసులను కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. మరికొంత మంది తక్కువ మొత్తంలో కొనుగోలుతో సరిపెట్టుకుంటున్నారు. ఇద్దరు చిన్నారుల కోసం పది రకాల టపాసులు కొనాలన్నా కనీసం రూ.2వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. మధ్య రకం స్పార్కిల్స్(కాకరపూలు) గతేడాది రూ.60 నుంచి రూ.70 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 ఉన్నాయి. చిచ్చుబుడ్డి బాక్స్ గతేడాది రూ.150 ఉండగా రూ.200కు పెరిగింది. పెన్సిళ్లు గతేడాది రూ.120 ఉండగా రూ.170కు పెరిగాయి. తాళ్లు గతేడాది రూ.120 ఉండగా ఈ ఏడాది రూ.150కు పెరిగాయి. 1000 వాలా టపాసులు గతేడాది రూ.350 విక్రయించగా ఈ ఏడాది రూ.450కు విక్రయిస్తున్నారు. రూ.500 వెచ్చిస్తే కనీసం 3 రకాలు కూడా రావడం లేదు. అధిక ధరల వల్ల చాలా దుకాణాల్లో ఫ్యామిలీ ప్యాక్‌లు తేవడమే మానేశారు. కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 100 స్టాళ్లలో టపాసుల విక్రయాలను ప్రారంభించారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 74 దుకాణాలను ఏర్పాటు చేశారు. టపాసుల ధరలు పెరగడంతో వ్యాపారాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

దీపాలకు తగ్గిన గిరాకీ

దీపావళి పేరులోనే ఉండే దీపాలకు గిరాకీ తగ్గింది. అందరూ టపాసుల కొనుగోళ్లకు ప్రాధాన్యతను ఇస్తుండటంతో దీపాలు, మట్టి ప్రమిదల వ్యాపారాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. గతేడాదితో పోలిస్తే చాలా తక్కువ మొత్తంలో విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంతో పాటు మద్దూర్ నగర్, ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలలో దీపాలు, మట్టి ప్రమిదాలు విక్రయించేందుకు చిరు వ్యాపారస్థులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో 20 దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో మరో 30 దుకాణాల వరకూ ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలోని శరీఫ్ నగర్, కృష్ణానగర్, కల్లూరు ఎస్టేట్ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఈ దీపాల విక్రయ దుకాణాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దుకాణాలు పెరగడం, కొనుగోలుదారులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగలేదు. దీంతో ఈ దీపావళికి నష్టాలు మూటగట్టుకోవాల్సిందేనని వ్యాపారులు చెబుతున్నారు.

బాణసంచా కొనేటట్టు లేదు

పెరిగిన ధరల వల్ల బాణసంచా కొనే పరిస్థితి లేదు. గత ఏడాదితో పోలిస్తే 10 నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగాయి. కనీసం రూ.వెయ్యి పెట్టినిదే ఏం రావడం లేదు. ఉన్న వాటితోనే పిల్లలకు సర్దుకోవాల్సి వస్తోంది.

- అశోక్, కర్నూలు.

వ్యాపారం తగ్గుతుంది

గతేడాది కంటే ఈ సారి వ్యాపారం కూడా తగ్గే అవకాశం ఉంది. ఎక్కువ మొత్తంలో కొనేవారు ఎవరో ఒకరు ఉన్నారు. చాలా మంది కొద్ది మొత్తంలోనే కొనుగోలు చేస్తున్నారు.

- ఎం.తులసీరావు, గౌతమ్ క్రాకర్స్, కర్నూలు.

డిసెంబర్ నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో చేపడుతున్న రోడ్ల మరమ్మతుల పనులు డిసెంబర్ నెల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్అండ్‌బి శాఖ పై జిల్లా కలెక్టర్ సమీక్ష చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 412 కిలోమీటర్ల ఆర్అండ్‌బి రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.11.16 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు రెండు, మూడురోజుల్లోపు మొదలు కావాలని ఆదేశించారు. కోడుమూరు నుండి ఎమ్మిగనూరు వరకు ఉన్న రహదారిని టాప్ ప్రయారిటీగా తీసుకోవాలన్నారు.

వర్షాల వల్ల 260.57 కి.మీ పొడవునా దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతుల కోసం మరో రూ. 5.22 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు త్వరలో మంజూరు అవుతాయని, ఈ రోడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, ఇఇ సురేష్ బాబు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై సమగ్ర నివేదిక : జెసి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలు వాగు వంకల భూములు ఎక్కడ ఆక్రమణకు జరిగాయో వాటికి సంబంధించిన సమగ్ర నివేదికను ఇవ్వాలని జెసి డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జెసి సమావేశం నిర్వహించారు. నదులు, వంకలు, కెనాల్ మొదలగు నీటి వనరులు, నీటి పరివాహక ప్రాంతాలలో జరిగిన ఆక్రమణలు వాటిపై తీసుకున్న సిసిఎల్ఎకు నివేదిక పంపాల్సి ఉంటుందని రెవెన్యూ అధికారులకు సూచించారు. కర్నూలులో హంద్రీ నదీ పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు జరిగి ఉన్నాయన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ , మున్సిపల్ , సర్వే అధికారులు సమిష్టిగా కృషి చేసి ఐదు టీములుగా ఏర్పడి నెల రోజుల్లోగా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండ, కోడుమూరు, ఆదోని, కోసిగి, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మొదలగు మండలాలలో కూడా పై విధమైన సర్వేలు నవంబర్ 15లోగా నివేదిక

అందజేయాలన్నారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణరెడ్డి, తహశీల్దార్లు ఆంజనేయులు, వెంకటలక్ష్మి , ఎడి సర్వేముని కన్నన్ పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు..!

- ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు

- చదువులు సాగేదెలా..? అక్షరాస్యత పెరిగేదెలా..?

ప్రజాశక్తి - కౌతాళం

ఉమ్మడి రాష్ట్రంలోనే అక్షరాస్యతలో వెనుకబడిన మండలాల్లో కౌతాళం ఒకటి. ఇలాంటి మండలంలో విద్యార్థులు చదువుకోవడానికి సరైన సౌకర్యాలు కల్పించి, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది. మండలంలోని ఉరుకుంద పంచాయతీ మజరా గ్రామమైన ఓబులాపురంలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంతమంది విద్యార్థులకు ఒకే ఒక ప్రధానోపాధ్యాయుడు చదువులు చెబుతున్నారు.

ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రార్థన చేయించడం, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అటెండెన్స్ వేయడం, బాత్ రూమ్ ఫొటోలు తీయడం, మధ్యాహ్న భోజనానికి వంట సరుకులు మెనూ ప్రకారం అందించడం, తరగతి వారీగా పాఠాలు చెప్పడం, అపార్ ఐడి కార్డు నమోదు చేయడం, అప్పుడప్పుడు ఎంఆర్‌సి భవనంలో నిర్వహించే సమావేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇన్ని పనులు నిర్వహిస్తూ 1 నుంచి 5వ తరగతి వరకు 'ఒకే ఒక్కడు' విద్యా బోధన చేయగలరా..? విద్యాశాఖ అధికారులే చెప్పాలి..!

పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఇలా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పేదల పిల్లలే ఉండడంతో, ప్రయివేట్ పాఠశాలలకు పంపించలేక, ఉపాధ్యాయులు లేని పాఠశాలలో చదివించలేక విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, విద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తే అక్షరాస్యత ఎలా పెరుగుతుంది. మండలంలోని ఒక పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటున్నారు. ఇలా ఒక పాఠశాలకు ఒక రకం మరో పాఠశాలకు ఇంకో రకం ఉపాధ్యాయులు కొనసాగుతుండడంతో ఎంఇఒలు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు

ఓబులాపురం గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసినా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు తెలిపారు. కనీసం డిప్యూటేషన్‌పై కూడా ఉపాధ్యాయులను నియమించడం లేదు.

శ్మశాన వాటికా.. ? నల్లమల అడవా..?

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో మైనార్టీల స్మశాన వాటిక నల్లమల్ల అడవులను తపిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ఘాటుగా విమర్శించారు. నగరపాలక సంస్థ పాలకమండలి, అధికారులు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు. కర్నూలు నగరంలోని (ఆమ్ ఖబరస్తాన్) స్మశాన వాటికను సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ జిల్లా నాయకులు ఎస్ ఎ. సుభాన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎం.డి. షరీఫ్, అబ్దుల్ దేశాయ్, శాఖ సభ్యులు షేక్ అహ్మద్,బషీర్, మూసమియ్య తదితరులు పర్యటించారు. అక్కడి పరిస్థితిని కళ్లారా చూసి నివ్వెరా పోయారు. చాలా దుర్మార్గంగా, దయానియంగా అక్కడి పరిస్థితి ఉందని వారన్నారు. నిజంగా ముస్లిం మైనార్టీల పై వున్న ప్రేమ అభిమానం పాలక పక్షానికి ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే నగరపాలక పాలకమండలి అధికారులు పర్యటించాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు, వర్కర్లను కేటాయించి స్మశాన వాటికను శుభ్రం చేయించాలని, ఏపుగా పెరిగిన వివిధ రకాల చెట్లను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాజాముద్దీన్, నూర్‌బాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పర్యటిస్తున్న నాయకులు

మార్కెట్‌లో ఉల్లి రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మార్కెట్‌లో ఉల్లిని పరిశీలించిన కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అత్యధికంగా ఉల్లి దిగుబడులు రావడంతో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌ను మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సందర్శించారు. కాటసాని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా రూ.13500 అందిస్తూ రైతు పండించిన ప్రతి పంట కొనుగోలు చేశామన్నారు. రైతులకు విత్తనం నుండి మొదలు పంట కొనుగోలు వరకు ఆ పంట నష్టం జరిగితే వాటి నష్టపరిహారం కూడా రైతు ఖాతాల్లో జమ చేసిన గొప్ప చరిత్ర వైఎస్.జగన్మోహన్ రెడ్డికి మాత్రమే సాధ్యమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇవ్వకపోగా కనీసం రైతు పండించిన పంటకు సరైన ధరను ఇవ్వకపోగా రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సర్వర్ సమస్యలని, మార్కెట్‌లో స్థలం లేదని, ప్రభుత్వం తలుచుకుంటే రైతు ముంగిట్లోనే పంటను గిట్టుబాటు ధర అందించాలన్నారు. 2017లో ఉల్లి రైతులకు ఇవ్వాల్సిన మద్దతు ధర అమౌంట్ నేటికీ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రైతులకు న్యాయం చేయకపోయినా పర్వాలేదు అన్యాయం చేయకుండా ఉండాలని హితవు పలికారు. ప్రభుత్వం రాకముందు ఒక మాట వచ్చాక ఇంకొక మాట మార్చడం సరైంది కాదన్నారు. అనంతరం మార్కెట్‌లో రైతుల సమస్యలు తీర్చాలని మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మితో చర్చించారు. రైతులకు న్యాయం చేసేలా కనీస గిట్టుబాటు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నగర నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వరప్రసాద్ ఇబ్రహీం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కర్నూలు నగర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వరప్రసాద్ ఎస్.ఇబ్రహీం లతోపాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలలో జరిగిన నగర మహాసభకు ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ జిల్లా కార్యదర్శి తిమ్మన్నలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడింది యుటిఎఫ్ పని చేస్తుందని పేర్కొన్నారు. 50 యేళ్ల ప్రస్థానం కొనసాగించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటుందని తెలిపారు. గూడూరులో నవంబర్ 2, 3 తేదీల్లోనిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 5న కలెక్టరేట్‌ను ముట్టడి

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని నవంబర్ 5న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోడుమూరు హైస్కూలులో బుధవారం కరపత్రాలను ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలయినా సమస్యలు మాత్రం పరిష్కారం చేయలేదన్నారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం నుండే తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15000 ఇవ్వాలన్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. డిగ్రీలో మేజర్ ,మైనర్ విధానాన్ని రద్దుచేసి డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని అన్నారు. పై డిమాండ్లతో నవంబర్5న కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు భారీగా తరలిరావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గూడూరు జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

గూడూరు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు ,మినరల్ వాటర్ ప్లాంట్ వెంటనే ఏర్పాటు చేయాలని బుధవారం ఎస్ఎఫ్ఐ గూడూరు మండల అధ్యక్షులు ఖాజావలి ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ రెడ్డికి వినిత పత్రం సమర్పించారు. మండల నాయకులు వేణు, ఇమ్రాన్, ఖాసిం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో జయరాజుది చెరగని ముద్ర

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన ఉపాధ్యాయ ఉద్యమంలో ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎం జయరాజు చెరగని ముద్రను వేసుకున్నారు. ఉపాధ్యాయ రంగ ఉద్యమంలో సుదీర్ఘకాలం పాటు పనిచేసి అనేక సమస్యలపై జరిగిన ఉద్యమాల్లో ఆయన పాలు పంచుకున్నారు. భాగస్వామ్యం అయ్యారు. ఆయన నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...1990 సంవత్సరంలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడిగా తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తిలో దాదాపుగా 34 సంవత్సరాల పాటు కొనసాగారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కూడా మండల ప్రధాన కార్యదర్శి నుండి జిల్లా ప్రధాన కార్యదర్శి వరకు పనిచేసి అనేక పోరాటాలో భాగస్వామ్యం అయ్యారు.

ఉపాధ్యాయ వత్తిలో: ఎస్ఎం జయరాజు 1990 జులైలో హోలగుంద మండలంలో

ఎంపిపిఎస్ పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడుగా పనిచేశారు. అక్కడ నుండి బండి ఆత్మకూరు మండలంలోని సింగవరంలోని ఎంపియుపిఎస్ పాఠశాల, 2001వ సంవత్సరంలో క ల్లూరు మండలంలోని బస్తి పాడుకు బదిలీ అయ్యారు. 2005లో పిఎస్‌హెచ్ఎం గా పదోన్నతి పొందారు. వెల్దుర్తి మండలానికి బదిలీ అయ్యారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలో జయరాజు (ఫైల్)

2011 వరకు అక్కడే విధులను నిర్వహించారు. 2020 సంవత్సరంలో పులగుమ్మి ఎంపిపిఎస్ పాఠశాలకు, అంబేద్కర్ నగర్ ఎంపిపిఎస్ పాఠశాలకు బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో : యుటిఎఫ్‌లో 2000 సంవత్సరంలో చేరారు. అక్కడి నుండి మండల ప్రధాన కార్యదర్శిగా , జిల్లా కార్యదర్శిగా, జిల్లా సహాధ్యక్షుడుగా పలు హోదాల్లో పని చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్రకౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో భాగంగా అనేక పోరాటాల్లో భాగస్వామ్యం అయ్యారు. ప్రధానంగా జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమంలో అప్రెంటిస్ విధానం రద్దు, బదిలీల కౌన్సిలింగ్ పారదర్శకత, నేషనల్ ఇంక్రిమెంట్ల సాధన, సిపిఎస్ జిపిఎస్ రద్దుతో పాటు యుపిఎస్ రద్దు తదితర అంశాలలో జరిగిన పోరాటాల్లో ఆయన భాగస్వామ్యం అయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విభజన అనంతరం కర్నూలు జిల్లాలో యుటిఎఫ్ ఉద్యోగ నిర్మాణంలో ఎంతో కషి చేశారు.

డిఎంహెచ్ఒకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైద్యులు

జిజిహెచ్‌లో త్వరలో యాక్షన్ ప్లాన్

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో యాక్షన్‌ప్లాన్ చేపట్టనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు పలువురు వైద్యులు , ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది , రాజకీయ నాయకులు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో పలువురు వైద్యులు , ఆసుపత్రి సిబ్బంది నా దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొచ్చారని, వాటికి త్వరలో కార్యాచరణ రూపొందించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన ఉండి ప్రతి ఒక్కరు వారి విధులను ఆచరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో త్వరలో యాక్షన్ ప్లాన్ రూపొందించి పలు విభాగాలకు ఆకస్మిక తనిఖీ చేస్తానని అన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన ప్రపోజల్స్ తీసుకొని ఆయా విభాగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరలో చేయనున్నట్లు తెలిపారు. కెఎంసి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాధారాణి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్‌లక్ష్మీబాయి, యురాలజీ హెచ్ఒడి డాక్టర్ సీతారామయ్య, అనస్తీసియ హెచ్ఒడి డాక్టర్ విశాల, ఆర్ ఇ హెచ్ సూపరిండెండెంట్ డాక్టర్ పృద్వి వెంకటేశ్వర్లు, డిప్యూటీ సిఎస్ఆర్ఎం డాక్టర్ హేమనలిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, ఎపిఎంఎస్ ఐడిసిఇఇ శివకుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు బురాన్ దొడ్డి విద్యార్థిని

ప్రజాశక్తి -సి బెళగల్

కృష్ణా జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 17 అంతర జిల్లా సైక్లింగ్ పోటీలలో సి. బెళగల్ మండలం బురాన్ దొడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వీరేశమ్మ చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎన్నిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల వసంత కుమారి తెలిపారు. విద్యార్థినికి అత్యుత్తమ శిక్షణ ఇచ్చి జాతీయస్థాయికి ఎంపిక అయ్యేలా కృషిచేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సత్యకుమార్‌ను హెచ్ఎం, పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ డిష్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయబృందం అభినందించారు.

మద్దతు ధర అమలు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రైతులకు మద్దతు ధరలు అమలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశులు, జిల్లా సహాయ కార్యదర్శి మల్లయ్య మాట్లాడారు. ప్రభుత్వ సంస్థల ద్వారా పంటలను కొనుగోలు చేయాలని, మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వేరుశనగ పంట పాసింగ్ విధానాన్ని రద్దు చేయాలని, మార్కెట్‌లో దోపిడీని అరికట్టాలని కోరారు. మార్కెట్‌లో గతనెల రోజుల నుంచి పత్తి, వేరుశనగ పంట ధరలు పడిపోతున్నాయని తెలిపారు. పత్తి పంట ధర రూ.8 వేల నుంచి రూ.7 వేలకు తగ్గిందన్నారు. వేరుశనగ క్వింటా రూ.7,500 నుంచి రూ.6 వేలకు తగ్గిందని తెలిపారు. మార్కెట్‌లో మౌలిక వసతులు సరిగా లేకపోవడం వల్ల వర్షానికి పంట కొట్టుకుపోయి రైతులు నష్టపోయారని తెలిపారు. పత్తి పంట మద్దతు ధర రూ.7,520, వేరుశనగ పంట మద్దతు ధర రూ.6,800 ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం మార్కెట్ సహాయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా నాయకులు అయ్యప్ప, ఈరన్న, బాష, వెంకటేశులు, రవి, రహీం, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

- టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, చెన్న బసప్ప

ప్రజాశక్తి - కౌతాళం

సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబానికి భరోసా ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప తెలిపారు. బుధవారం పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని కొత్తవారికి అవగాహన కల్పించాలన్నారు.

టిడిపిలోకి బదినేహాల్ వైసిపి కార్యకర్తలు

మండలంలోని బదినేహాల్ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాదిగ మల్లికార్జున, నాగేష్, అయ్యప్ప, మాలాజీ ముకప్ప, పెద్ద మొడ్డి అయ్యప్ప, దాదాపు 30 మంది టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కౌతాళం పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, రమేష్ గౌడ్, వెంకటరెడ్డి, దొడ్డన్న గౌడ్, కురుగోడు, రాజబాబు, రహ్మాన్, సిద్ధు, సోమన్న, సల్మాన్ రాజు, ఉమేష్ గౌడ్, వీరేష్ పాల్గొన్నారు.

ఉమేష్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం

- ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల గాదిలింగ

ప్రజాశక్తి - చిప్పగిరి



ఉమేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన దళిత ఉమేష్‌కు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల గాదిలింగ తెలిపారు. బుధవారం దాడిలో గాయపడి ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమేష్‌ను ముత్యాల గాదలింగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు పరామర్శించారు. బాధితుడు ఉమేష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు ఉచ్చిరంగప్ప, గంగాధర్, మణికంఠ, మనోజ్ పాల్గొన్నారు.

గజ్జెహళ్లి పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని గజ్జెహళ్లి మండల పరిషత్ పాఠశాలను ఎంఇఒ సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలల సమస్యలపై ఆరా తీశారు. రెగ్యులర్‌గా తరగతులు జరుగుతున్నాయా లేదా, ఆహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఇఒ సత్యనారాయణ మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులు హాజరు, సబ్జెక్టు వారీగా పాఠాలు పూర్తి వంటి వివరాలు పాఠశాలలో రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్కూల్ ఛైర్మన్ అనిల్ స్వామికి తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రావణి, బిజెపి జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ సి.రామలింగ పాల్గొన్నారు.

కౌన్సిలర్ల వాకౌట్

● కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఆదోని

కౌన్సిల్ నుంచి బయటకు వెళ్తున్న వైసిపి కౌన్సిలర్లు

కనీస గౌరవం కూడా ఇవ్వని కౌన్సిల్ సమావేశంలో ఎందుకు ఉండాలని అసహనంతో వైసిపి కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాకముందే వైసిపిలో విభేదించి బయటికెళ్లిన కౌన్సిలర్లు లలితమ్మ, సురేష్, పద్మావతిలు ఛైర్మన్ పోడియం వద్ద ప్లకార్డు ధరించి నిరసనకు దిగారు. 2014 టిడిపి ప్రభుత్వంలో అప్పటి వైసిపి కౌన్సిలర్లు వ్యక్తిగత మురుగుదొడ్ల నిర్మాణంలో భారీ అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా దోచుకున్న సొమ్మును రికవరీ చేయించాలని నినాదాలు చేశారు. సుమారు 41 వార్డుల్లో రూ.36 లక్షల వరకు అవినీతి జరిగిందని, సిబిసిఐడితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వైసిపి కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ అభ్యంతర వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై అప్పుడే విచారణ పూర్తయిందని, ఆ అంశాన్ని లేవనెత్తి వైసిపిని నిందించడం తగదని తెలిపారు.

ఛైర్మన్‌తో వాగ్వాదం

మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైస్ ఛైర్మన్లకు ప్రత్యేకంగా కుర్చీ వేసే ఆనవాయితీ ఇన్నేళ్లు సాగిందని, ఉన్నపలంగా తొలగించి కౌన్సిలర్ల వరుసలో వేయడం ఏమిటని వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్‌లు ఛైర్మన్ శాంతతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే మాటలు విని సభలో అవమానించడం తగదంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదని, మున్సిపల్ యాక్ట్ ప్రకారం వైస్ ఛైర్మన్లకు ప్రత్యేకంగా కుర్చీ ఏర్పాటు చేయాల్సి ఉందని, అధికారుల తీరుపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. వైసిపి కౌన్సిలర్ల అండతో ఛైర్మన్ పదవి చేపట్టిన శాంత ఆ పార్టీ కౌన్సిలర్ల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

కౌన్సిలర్లను అవమాన పరుస్తున్నారు

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన బిల్లు చెల్లింపు అంశాన్ని అజెండాలో చేర్చాలని వైసిపి కౌన్సిలర్లు 26 మంది సంతకాలతో కూడిన వినతిపత్రం ఇచ్చిన ఎందుకు చేర్చలేదని వైసిపి కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మెజార్టీ సభ్యులు ఇచ్చిన అంశాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారని వైస్ ఛైర్మన్ నరసింహులు కమిషనర్ కృష్ణను ప్రశ్నించారు. ఛైర్మన్ నిర్ణయం మేరకే ఆ అంశాన్ని పొందపరచలేదని కమిషనర్ సమాధానం చెప్పారు. కౌన్సిలర్లు లేనిదే ఛైర్మన్ అధికారం చలాయిస్తారా అంటూ ప్రశ్నించారు. ఛైర్మన్ నిర్ణయమే అంతిమ తీర్పు అంటూ కమిషనర్ కృష్ణ పేర్కొన్నారు. వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేసి కౌన్సిల్ హాలు ముందు నిరసన వ్యక్తం చేశారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు..!

ఆదోనిలో భూకబ్జాలు, అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు చేయడం బిజెపి నాయకుల నైజమని కౌన్సిలర్ పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలను వ్యక్తిగతంగా చూస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తాము నిర్వహిస్తున్న వంశీ చైతన్య నర్సింగ్ హోమ్‌లోకి ఏ అధికారంతో బిజెపి నాయకులు చొరబడ్డారో సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. తన భర్త, కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ రాజకీయంగానే విమర్శలు చేశారని, దీన్ని మనసులో ఉంచుకొని ప్రయివేట్ ఆస్పత్రిపై ఎందుకు కక్ష పెంచుకున్నారని, అధికారం శాశ్వతం కాదని తెలుసుకో వాలని అన్నారు. బిజెపి నాయకుల అండతోనే మున్సిపల్ ఛైర్మన్ శాంత వైఖరి మారిందని మహిళా కౌన్సిలర్లు దుమ్మెత్తి పోశారు. అధికారం లేనంత మాత్రాన పార్టీల కండువా మార్చడం తగదంటూ కౌన్సిలర్లు లోకేశ్వరి, కీర్తన, కృష్ణవేణి, లక్ష్మి అభ్యంతరం తెలిపారు. బిజెపి నాయకులు అభివృద్ధి వైపు దృష్టి సారించాలని హితవు పలికారు.

వేతనాలు ఇవ్వాలని వినతి

కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యే కౌన్సిలర్లకు సక్రమంగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి ఛైర్మన్ శాంతకు వినతిపత్రం ఇచ్చారు

కౌన్సిల్ సమావేశం వాయిదా

వైసిపి కౌన్సిలర్లు సమావేశంలోకి రావాలని డిప్యూటీ ఇంజినీర్ రామ్మూర్తి సంప్రదించారు. ససేమిరా అనడంతో మున్సిపల్ ఛైర్మన్ చేత కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, బాలాజీ, ఇంతియాజ్, చలపతి, ఉస్మాన్, వసీం, అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇంతియాజ్, డిప్యూటీ ఇంజినీర్ చలపతి రెడ్డి, గోపీనాథ్, రామ్మూర్తి, సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, రెవెన్యూ ఆఫీసర్ నజీర్ హుస్సేన్, డిపిఒ బాల మద్దిలేటి, చంద్రమోహన్, లెనిన్ ఉన్నారు.

ఛైర్మన్‌తో వాగ్వాదానికి దిగిన వైస్ ఛైర్మన్ నరసింహులు

సాగునీటి ప్రాజెక్టులతో జిల్లా అభివృద్ధి : తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

జిల్లా అభివృద్ధి చెందాలంటే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం ఉండవల్లిలో చంద్రబాబును కలిసిన ఆయన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ వంటి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం నాయకులు ప్రాణేష్ అధ్యక్షతన శాఖ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఆస్పత్రి లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలతో ఎమ్మిగనూరు, ఆదోని, రాయచూరు, ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు లేక చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి కృషి చేయాలని కోరారు. మండల కార్యదర్శిగా జయరాజు ఎన్నికైనట్లు తెలిపారు. మండల నాయకులు భీందాస్, ఆంధ్రయ్య, రాజు, ప్రసంగి, అనిల్ పాల్గొన్నారు.

సబ్ కెనాల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

పజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి సబ్ కెనాల్ ద్వారా గుండ్లకొండ, నేలతలమరి, గుడిమిరాళ్ల, బంటుపల్లి, బుర్రకుంట, కె.వెంకటాపురం, చెల్లెల చెలిమెల, బేతపల్లి, బండపల్లి, పి.కోటకొండ గ్రామాలకు సాగునీరందించి చెరువులను నింపడానికి సబ్ కెనాల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఇరిగేషన్ ఇంజినీర్ సోమన్న తెలిపారు. బుధవారం టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు వెంకటస్వామి గౌడ్, రమణారెడ్డి, సర్పంచి నాగరాజు గౌడ్, మాజీ సర్పంచి గిడ్డయ్య గౌడ్, మల్లెపల్లి రంగడు, వివిధ గ్రామాల రైతులు ఇంజినీర్‌తో మాట్లాడి సమస్యను విన్నవించుకున్నారు.

స్వలాభం కోసమే ఫిరాయింపులు

- **వార్డు అభివృద్ధి పేరు చెప్పడం సిగ్గుచేటు**
- **వైసిపి కౌన్సిలర్ శివకుమార్**
- **రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం**

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఛైర్మన్ డాక్టర్ రఘు

స్వలాభం కోసం పార్టీ ఫిరాయింపులు చేసి, వార్డుల అభివృద్ధి పేరుతో కొంతమంది వైసిపి కౌన్సిలర్లు టిడిపి కండువా కప్పుకోవడం సిగ్గుచేటని వైసిపి కౌన్సిలర్ శివకుమార్ విమర్శించారు. బుధవారం మున్సిపల్ సమావేశ భవనంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఛైర్మన్ రఘు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం అజెండా అంశాలను తీర్మానం కోసం తిలకిస్తుండగా వార్డు అభివృద్ధి పనులను కాంట్రాక్టర్‌కు అప్పజెప్పే విషయంపై కౌన్సిలర్ శివకుమార్ అభ్యంతరం తెలిపారు. మెప్మా ఆర్‌పిల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, 18, 9వ వార్డులో శివ గంగమ్మ, నూర్జహాన్ సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా రాజకీయంగా అధికారులు దూరం పెడుతున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని, ఆర్‌పిలకు అండగా ఉంటామన్నారు. వైడబ్ల్యుఎస్ గ్రౌండు స్థలం ఆక్రమణకు గురయిందని పదే పదే టిడిపి కౌన్సిలర్ దయాసాగర్ లేవనెత్తేవారని చెప్పారు. అధికారం చేపట్టిన వెంటనే ఆక్రమణ షెడ్యూల్ తొలగిస్తానని ప్రగల్బాలు పలికారని, ఏమయ్యాయని నిలదీశారు. టిడిపి కౌన్సిలర్ దయాసాగర్ జోక్యం చేసుకుని... గత ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధికి నోచుకోలేదని, వార్డు అభివృద్ధికి టిడిపి కృషి చేసోతందని తెలిపారు. వైసిపి కౌన్సిలర్, టిడిపి కౌన్సిలర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కౌన్సిల్ సమావేశాన్ని మధ్యలో ముగించారు. కౌన్సిలర్ స్వాతి, వాహిద్ మాట్లాడుతూ... పార్టీలు మారడం సర్వసాధారణమేనని, వార్డు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు పార్టీ మారినట్లు తెలిపారు. టిడిపిలో చేరిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లను 'సిగ్గు, మొగ్గు' అని సంబోధించడం బాధాకరమని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిలర్లు

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - కౌతాళం

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం కాటికాపరుల సమస్యల పరిష్కారం కోసం వాల్మీకి మహర్షి విగ్రహం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కెజిబిఎస్ మండల కార్యదర్శి ఎం.వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య మాట్లాడారు. తరతరాలుగా సమాజానికి ఉపయోగపడే వృత్తిని భుజానేసుకుని వెట్టిచాకిరిలా చేస్తూ వచ్చినా, నేటికీ శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరులను ఒక వృత్తిగా గుర్తించడం లేదన్నారు. కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించి, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వృత్తి పరికరాలను ఉచితంగా ఇవ్వడంతో పాటు, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... ఇప్పటికే అనేక గ్రామాల్లో సచివాలయ అధికారులకు వినతులు ఇచ్చారని, అవి తన దృష్టికి వచ్చాయని తెలిపారు. సమస్య వాస్తవమైందని, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కెజిబిఎస్ మండల నాయకులు జయరాం, బసవ, ఈరన్న, నాగరాజు, వీరప్ప, ఎల్లప్ప, చంద్రప్ప, మహానంది, హనుమేష్, లూథర్, మహాదేవ, సునీల్ కుమార్, ఆదాం పాల్గొన్నారు.

ధర్నా చేపడుతున్న నాయకులు

బాధితునికి కెవిపిఎస్ పరామర్శ

ప్రజాశక్తి - ఆదోని

గూళ్యం గ్రామంలో దాడికి గురైన ఉమేష్‌ను బుధవారం ఆదోని మధు ఆస్పత్రిలో కెవిపిఎస్ ప్రతినిధి బృందం పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకుంది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, ఆదోని మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులు లక్ష్మన్న, యువరాజ్ మాట్లాడారు. దారికి అడ్డం తప్పుకోమంటే 12 ఏళ్ల పిల్లవాడు కులం పేరుతో దూషించడమే కాక, తల్లిదండ్రులను పిలిపించి దళితుడైన ఉమేష్‌పై దాడి చేయడం ఏమిటని నిలదీశారు. ఈ ఘటన అక్కడికక్కడ జరిగిన క్షణికావేశం కాదన్నారు. దీనికి గ్రామంలో తరతరాలుగా కొనసాగుతున్న అంటరానితనమే ప్రధాన కారణమని తెలిపారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతి, రెండు అరుగుల విధానం కొనసాగుతోందని చెప్పారు. ఘటన జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితులను స్టేషన్‌లో పెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో సరైన వైద్య సదుపాయం లేకపోవడంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చేరాల్సి రావడంతో ఆస్పత్రి ఖర్చును ప్రభుత్వమే భరించాలన్నారు. గ్రామంలో ఘర్షణలు తలెత్తకుండా భద్రతను ఏర్పాటు చేయాలని, గ్రామంలో నెలకొన్న అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించాలని కోరారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

అసాంఘిక చర్యలను అడ్డుకోండి

- వైకుంఠం ప్రసాద్

ప్రజాశక్తి - ఆలూరు

కాస్మోటిక్ క్లబ్‌లో అసాంఘిక చర్యలను అడ్డుకోవాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కోరారు. బుధవారం ఎస్ఐ సి.వెంకట నరసింహులుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల కోసం రీడింగ్ బుక్స్, క్యారం బోర్డు, టెన్నిస్ కోసం ఉంటూ, దుకాణాల ద్వారా వచ్చిన ఆదాయంతో సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగించాల్సిన సొమ్మును మింగేస్తూ.. కొందరు సొంత క్లబ్ లాగా మద్యం తాగడం, పేకాట ఆడడం, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్నారని తెలిపారు. ఎస్ఐతో కలిసి క్లబ్‌ను తనిఖీ చేయగా ఇవన్నీ కంట పడ్డాయన్నారు. క్లబ్ ఎదురుగా పోలీసు స్టేషన్ ఉన్నా, పక్కన కోర్టు ఉన్నా అసాంఘిక కార్యకలాపాలు నడపడం క్షమించరానిదని తెలిపారు. పోలీసులు క్లబ్‌ను మూసివేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

గంజిహళ్లి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 15న జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గంజిహళ్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభను చాటారు. జిల్లాస్థాయి వ్యాసరచనలో 9వ తరగతి విద్యార్థిని టి.సౌమ్య ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3 వేల నగదు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. 8వ తరగతి విద్యార్థిని ఎం.అనుప్రియ చిత్రలేఖనం పోటీలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3 వేల నగదు, ప్రశంసాపత్రం పొందారు. వీరికి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తన కార్యాలయంలో బుధవారం బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. బయాలజీ స్కూల్ అసిస్టెంట్ టీచరు రంగమ్మను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. **హోళగుంద** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎస్ఎస్.సందేష్ జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి పొందారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ విద్యార్థికి రూ.5 వేల నగదు, మొమెంటో, సర్టిఫికట్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎన్ఎమ్‌డి.నజీర్ అహ్మద్, విద్యా కమిటీ ఛైర్మన్ ద్వారకానాథ్ అభినందించారు.

బేరసారాలు..!

- **బాణసంచా దుకాణాల అనుమతుల్లో చేతివాటం**
- **దరఖాస్తుదారులతో రెవెన్యూ సిబ్బంది బేరాలు**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

దీపావళి పండగకు బాణసంచా విక్రయించేందుకు తాత్కాలికంగా ఇచ్చే లైసెన్సుల విషయంలో రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దరఖాస్తుదారులతో బేరాలు మాట్లాడుకుంటున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నారు. సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

పెద్దఎత్తున బాణసంచా విక్రయాలు

ఆదోని పట్టణంలో దీపావళి పండగకు బాణసంచా విక్రయాలు పెద్దఎత్తున జరుగుతాయి. మూడురోజులపాటు రూ.లక్షల వ్యాపారం జరుగుతుంది. బాణసంచా విక్రయాల ద్వారా మంచి లాభాలు కూడా ఉండడంతో వ్యాపారులు లైసెన్స్‌ల కోసం పోటీపడతారు. వారంతా ముందుగా దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం మీసేవ, సచివాలయాల నుంచి పలు రకాల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకుంటారు. వీటిని పరిశీలించిన అనంతరం రెవెన్యూ అధికారులు లైసెన్సులు మంజూరు చేస్తారు. పట్టణంలోని మున్సిపల్ మైదానంలో 9 దుకాణాల ఏర్పాటుకు అనుమతిచ్చారు. ఈ అనుమతుల కోసం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి, అగ్నిమాపక సిబ్బందికి, సేల్స్ టాక్స్ ఆఫీసర్లకు చలానాతోపాటు అదనంగా రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఇచ్చినట్లు సమాచారం. చలానాకు రూ.500 అయితే, అదనంగా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని వ్యాపారులు లబోదిబోమంటు న్నారు. మామూలు ఇవ్వడంతో పాటు కార్యాలయ సిబ్బందికి బాణసంచాలు కొంత ముట్టజెప్పాలని వాపోయారు.

మొదలైన వసూళ్లు : రెవెన్యూ అధికారుల నుంచి లైసెన్స్ పొందిన వారు పట్టణంలోని మున్సిపల్ మైదానంలో బాణసంచా విక్రయాలు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాలు కీలకంగా ఉంటాయి. దీపావళికి బాణసంచా దుకాణాలు పట్టణంతోపాటు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఇప్పటికే దరఖాస్తుదారులతో బేరసారాలు కొనసాగించినట్లు తెలిసింది. కొన్నిచోట్ల వసూళ్లు కూడా ప్రారంభించినట్లు సమాచారం. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులు లైసెన్స్‌ల మాటున జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వినియోగదారులపై భారం

అధికారుల మామూళ్లు, మెయింటెనెన్స్ భారంతో పాటు షాపు ఏర్పాటు కోసం బల్లలు, టెంట్లు, షెల్ఫ్‌లకు మూడు రోజుల అద్దె, పనిచేసే సిబ్బందికి వేతనాల రూపంలో షాపులను బట్టి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ భారమంతా బాణసంచా కొనుగోలుదారులపైనే వేయడం వల్ల ధరలు మరింతగా పెరిగిపోతాయి. మరోవైపు సిబ్బందికి పంచాలంటూ కూటమి నేతలు బాణసంచా ఇవ్వాలని అడుగుతున్నారని చెబుతున్నారు. గతంలో లైసెన్సుల జారీకి ఆయా కార్యాలయా ల వద్ద సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పేవారమని, ముందెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మామూళ్లు పెంచేశారని వాపోతున్నారు. అమ్మకాలు సరిగా జరగకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు.

సిబ్బందికి బాణసంచా తీసుకెళ్తున్న దుకాణదారుడు

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- సమావేశానికి తగ్గిన ఎంపిటిసి, సర్పంచుల హాజరు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. బుధవారం వైస్ ఎంపిపి నడిపి షేక్ షాబ్ అధ్యక్షతన ఎంపిడిఒ పుల్లారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు చాలామంది హాజరు కాలేదు. హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య చర్చ వాడీవేడిగా సాగింది. శాఖల వారీగా అధికారులు వారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఎఇ నరసింహులు మాట్లాడారు. మండలంలో 25 వర్కులను రూ.2.80 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం వర్కును చేయడం లేదని అధికారిని ప్రజా ప్రతినిధులు నిలదీశారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రేమ్ కుమార్ మాట్లాడారు. మండలంలోని 15 పంచాయతీలకు రూ.12 కోట్లతో జలజీవన్ మిషన్ కింద పనులను ప్రారంభించామని తెలిపారు. మండలంలో 25 ఆర్‌ఒ ప్లాంట్లు ఉన్నాయని, 12 ఆర్‌ఒ ప్లాంట్ల ద్వారా సురక్షిత మంచినీరు అందిస్తున్నామని చెప్పారు. మిగిలిన ఆర్‌ఒ ప్లాంట్ల మరమ్మతులను చేయించి ప్రజలకు మంచినీటిని అందిస్తామని తెలిపారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయాలని ప్రజాప్రతినిధులకు చెప్పారు. ఎఒ స్రవంతి మాట్లాడుతూ... రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వారికి రావాల్సిన సబ్సిడీలపై, పంటల నమోదుపై అవగాహన కల్పించి రైతులకు సహకరించామని చెప్పారు. ఫర్టిలైజర్ యజమానులు రైతులను వివిధ రూపాల్లో మోసం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు ఒక్కటి కూడా లేవని ప్రజా ప్రతినిధులు ఆమెను నిలదీశారు. షాపులపై తూతూ మంత్రంగా తనిఖీ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల దగ్గరికి, స్కూల్ దగ్గరికి వెళ్లి చిన్న పిల్లలకు తమ వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యాధికారి తెలిపారు. ప్రజలకు ఆరోగ్య విషయంలో అవగాహన కల్పించడంలో వైద్యాధికారు లు విఫలం చెందారని ప్రజాప్రతినిధులు ఆయనపై మండిపడ్డారు. డిసెంబర్ లోపు పాత హౌసింగ్ నిర్మాణాలను చేపట్టాలని హౌసింగ్ అధికారి గురుస్వామి తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలలో కొత్త హౌసింగ్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టబోతుందని చెప్పారు. హాలహర్విలో హౌసింగ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచి తిమ్మప్ప అధికారులకు తెలిపారు. ఎంఇఒ సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. నవంబర్ 14న మెగా పేరెంట్స్ మీటింగ్ జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. విద్యా కమిటీ ఛైర్మన్‌లు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించాలని తెలిపారు. బాల్యవివాహాలు నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని శిశు సంరక్షణ అధికారిని తెలిపారు. రీసర్వేలో జరిగిన తప్పులతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, వాటిని పరిష్కరించడానికే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ముగతి సర్పంచి విరుపాక్షి రెడ్డి, షేక్ అహ్మద్, సర్పంచి తిమ్మప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దేవనకొండను కరువుగా ప్రకటించాలి

- శాస్త్రీయత లేని కరువు మండలాల ప్రకటన : సిపిఎం

ప్రజాశక్తి- దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో ఏమాత్రం శాస్త్రీయత లేదని, దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ బాష కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకొని కరువు మండలాల జాబితా రూపొందించిందని తెలిపారు. కరువు వల్ల బాగా నష్టపోయిన మండలాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో పంటలకు తగ్గట్టు వర్షాలు కురవలేదని తెలిపారు. ఆయా మాసాల్లో రెండు, మూడు రోజుల్లో వరుసగా కురిసిన వర్షపాతాన్ని ఆధారంగా చేసుకుని అధికారులు వర్షాభావ పరిస్థితిని లెక్క కట్టారని చెప్పారు. ఒకటి, రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు ఏమాత్రమూ సరిపోదని తెలిపారు. మండలంలోని కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, కోటకొండ, బేతపల్లి, చెలిమి చెలిమిల, బంటుపల్లి, వెంకటాపురం, గుండ్లకొండ, తెర్నేకల్, పాలకుర్తి, గుమ్మరాళ్ల, కరివేముల తదితర గ్రామాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు బాగా దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు వాస్తవాలను గమనించి కరువు మండలాలను ప్రకటించాలని కోరారు.

'ఉపాధి' అక్రమాలపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం జిల్లా విజిలెన్స్ అధికారి లోకేశ్వర్, ఉపాధి హామీ ఏపీడీ పకీరప్ప, ఎపిఒ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించారు. గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. గతంలో ఉపాధి హామీ పనులు ఏ విధంగా జరిగాయి, పనుల గుర్తింపు, కూలీలకు అందించిన వేతనాలు తదితర అంశాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకు న్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటా మని గ్రామస్తులకు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావుకు వినతిపత్రం అందజేశారు.

IN THE COURT OF THE FIRST ADDITIONAL SENIOR CIVIL JUDGE AT BALLARI

E.P. 22/2024 (0.S. No.57/2017)

BETWEEN:

Sri.T.Sreenivas Reddy ...Decree Holder

And

Sri. Venkaaramana ...Judgment debtor

To,

Judgment Debtor : M.Venkataramana S/o Mangala Narayana, Aged about 48 years, R/o House No.16-17-1-3, old Town, Done, Kurnool District A.P.

Whereas the above named DHr has made application to this court for Execution of Decree in suit No.57/2017 for executing the registered sale deed by you, are hereby warred to appear in the court in person or by a pleader duly instructed on the 02-12-2024 at 11'0 clock in the fore noon to shown cause against the application failing wherein said application will be heard and determined Ex-parte.

Give under my hand and the seal of the court, this 30-10-2024

Thippeswamy.K

Adcocate For Decree Holder